క్లుప్తంగా

దానంతో తృప్తి.. ధ్యానంతో ప్రశాంతత



సమావేశంలో పాల్గొన్న అరవ మణికంఠ, అధ్యక్షుడు దండిప్రోలు మహేష్ తదితరులు

కాకినాడ కల్చరల్: ధ్యానం భారతీయ జీవన విధానమని బ్రహ్మ ధ్యాన సత్సంగ్ జాతీయ అధ్యక్షుడు అరవ మణికంఠ అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో సత్సంగ్ నగరశాఖ అధ్యక్షుడు దండిప్రోలు మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం సత్సంగ్ సమావేశం జరిగింది. దానం, ధ్యానం అనే రెండు సాధనాలు భారతదేశాన్ని విశ్వగురువుగా నిలుపుతాయని దండిప్రోలు అన్నారు. దానం వల్ల మనసుకు తృప్తి, ధ్యానం వల్ల మనసుకు ప్రశాంతతను లభిస్తాయని ఆయన అన్నారు. సత్సంగ్ సభ్యులు అప్పలరాజు, వీరబాబు, ఇగ్నైటిక్ హెల్పింగ్ హ్యాండ్స్ డైరెక్టర్లు గౌతమ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు తొలగించాలి

బోట్‌క్లబ్: హిందువుల మనోభావాలు దెబ్బతినేలా సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టులు వెంటనే తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కాకినాడ దేవాలయంవీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి మాలకొండయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులు దొడ్డి వీరేంద్ర, గొల్లపల్లి శివ, సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, చెక్కా రమేష్ పాల్గొన్నారు.

రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో..

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ శివాలయం వద్ద బీజేపీ నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొని శివరాత్రి రోజున వైఎస్సార్ సీపీ ట్వీట్‌ను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యలపై పోరాటమే లక్ష్యం

బాలాజీచెరువు: రేషన్ కార్డులతో పాటు అందరికీ రేషన్ సక్రమంగా ఇవ్వాలంటూ 20వ వార్డు సచివాలయ పరిధిలోని స్థానికులు జనసేన నగర ఇన్‌చార్జి ముత్తా శశిధర్‌కు వివరించారు. 'మన ప్రాంతం మన సచివాలయం'లో భాగంగా ఆయన పర్యటించారు.

ప్రశాంతంగా ఎస్సై రాత పరీక్షలు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆదివారం ఎస్సై రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కాకినాడ జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా సకాలంలో పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. 100 మంది పోలీస్ సిబ్బందితో పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగినట్టు తెలిపారు. పరీక్షల నిమిత్తం వచ్చిన అభ్యర్థులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిందన్నారు. ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్‌లోని 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉదయం 10 గంటలకు జరిగిన పరీక్షకు 5650 మందికి గాను 5118 మంది అభ్యర్థులు, ప్రగతి క్యాంపస్‌లో 1152 మందికి గాను 1028 మంది పరీక్షలు రాశారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగిన పరీక్షలకు ఆదిత్యలో 5650 మందికి గాను 5114 మంది, ప్రగతిలో 1152 మందికి గాను 1027 మంది హాజరైనట్టు ఎస్సై వై.గజేష్ కుమార్ తెలిపారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పి.శ్రీనివాస్, పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీ మోహన్, జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం–వెల్దుర్తి రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన అనిల్‌కుమార్ కరప మండలం కరప, నడకుదురు గ్రామాలకు చెందిన మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై ధర్మవరం వచ్చారు. తిరిగి వెళ్తుండగా ధర్మవరం–వెల్దుర్తికి మధ్యలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న అనిల్ కుమార్‌కు కాలు విరిగిపోగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

5 వేల మందికి అన్నదానం

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో వేంచేసిన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రారంభించారు. సుమారు 5 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

టెన్‌షన్ పోయింది!

- పరీక్షల్లో ఆరు పేపర్లే
- విద్యార్థులపై తగ్గిన ఒత్తిడి
- తల్లిదండ్రుల్లో ఆనందం



ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

కాకినాడ సిటీ: విద్యార్థుల భవితకు టెన్త్ కీలక మలుపు. ఈ పరీక్షలంటే విద్యార్థులకు ఎక్కడ లేని భయం. ఈ భయాన్ని పోగొట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచి పబ్లిక్ పరీక్షల్లో 6 పేపర్లే ఉండడం విద్యార్థులకు కొంత ఉపశమనమని విద్యావేత్తలు చెబుతున్నారు. జిల్లాలో 251 ప్రభుత్వ, 205 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 29,991 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. గతంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొత్తం 11 పేపర్లు ఉండేవి. హిందీ మినహా మిగిలిన ఒక్కో సబ్జెక్టుకు రెండు పేపర్లు ఉండేవి. కోవిడ్ కారణంగా గత ఏడాది పది పబ్లిక్ పరీక్షల్లో 7 పేపర్లు నిర్వహించారు. కరోనా నేపథ్యంలో 2019–21 విద్యా సంవత్సరాల్లో పరీక్షలు నిర్వహించలేదు. సమ్మేటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కులను ప్రామాణికంగా తీసుకుని మార్కులు కేటాయించారు. 2022–23 విద్యా సంవత్సరం నుంచి పది పబ్లిక్ పరీక్షల్లో 6 పేపర్లు మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టులు ఉండగా, వీటిలో హిందీ తప్ప మిగిలిన సబ్జెక్టులకు రెండేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ విద్యా సంవత్సరం నుంచి సెకెండరీ బోర్డు తరహాలో ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో పరీక్ష మాత్రమే నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి మోడల్ పేపర్లు సిద్ధం చేసి ఉపాధ్యాయులకు అందజేశారు. వాటి నమూనాతో ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు విద్యార్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రభుత్వం నిర్దేశించిన 6 పరీక్ష పేపర్ల ఆధారంగానే జిల్లా పరిషత్ యంత్రాంగం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పర్యవేక్షణలో పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాభారతి పేరుతో 40 వేలకు పైగా ప్రత్యేక స్టడీ మెటీరియల్ అందజేశారు.

చదువుకునేందుకు కావలసినంత సమయం



పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 6 పేపర్లకు తగ్గించడంతో విద్యార్థులు చదువుకునేందుకు ఎక్కువ సమయం దొరుకుతుంది. నూతన పరీక్ష విధానం వల్ల పరీక్షలు కేవలం ఆరు రోజుల్లోనే ముగిసిపోతాయి. దీని వల్ల విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గుతుంది. పరీక్షల సమయంలో ప్రశాంతంగా రాసి ఎక్కువ మార్కులు తెచ్చుకునేందుకు ఉపయోగపడుతుంది.

– నక్కా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, కాకినాడ జిల్లా

'ఆవాజ్' కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న జవహర్ అలీ

కాకినాడ సిటీ: ముస్లిం మైనారిటీల అభివృద్ధి, భద్రత, లౌకికవాదం లక్ష్యాలుగా ఏర్పడిన ఆవాజ్ సంస్థ నగరంలో ప్రారంభించి కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి ప్రముఖ న్యాయవాది మహ్మద్ జవహర్ అలీ అధ్యక్షతన ఆవాజ్ కాకినాడ నగర సమావేశం యూటీఎఫ్ హోంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి మాట్లాడుతూ 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆవాజ్ ఏర్పడిందన్నారు. జస్టిస్ సచార్ కమిటీ, రంగనాథ్‌మిశ్రా కమిటీల సిఫార్సుల అమలుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రముఖ న్యాయవాది సయ్యద్ సలార్, హసన్‌షరీఫ్, సులేమాన్ తదితరులు ఆవాజ్ సంస్థ బలోపేతం కావాలన్నారు. కన్వీనర్‌గా మహ్మద్ ఇబ్రహీం, ఆవాజ్ నగర కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఖాదర్ బాషా, నసీరుద్దీన్, షబ్బీర్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రులకు చేయూతనిద్దాం



1989-90 ఆనంద భారతి మున్సిపల్ హై స్కూల్ పదో తరగతి విద్యార్థులు

- పూర్వ విద్యార్థుల ఔదార్యం
- 1989–90 బ్యాచ్ తీర్మానం

కాకినాడ: వారంతా 1989–90 విద్యా సంవత్సరంలో స్థానిక ఆనంద భారతి మున్సిపల్ హైస్కూల్‌లో కలసి పదో తరగతి చదువుకున్నారు. కష్టాల్లో ఉన్న బాల్య మిత్రుని కోసం వారంతా ఒక్కచోట సమావేశమయ్యారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న మిత్రులంతా ఆదివారం కొత్త కాకినాడలోని బాల్య మిత్రుడు దెయ్యాల నాగేశ్వరరావు ఇంటి వద్ద కలసుకుని సందడి చేశారు. నాటి అల్లర్లు, చిలిపి పనులు, గిల్లికజ్జాలు, చెట్టపట్టాలు, ఆటలు అన్నీ గుర్తుచేసుకున్నారు. వారి సహ విద్యార్థి, వికలాంగుడైన బాల్యమిత్రుడు జీర వెంకట రమణ పై చదువులు చదివే స్తోమత లేక ఇంటింటికీ తిరుగుతూ వాము అరుకు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఆర్థిక చేయూతనివ్వాలని సంకల్పించి తలో చెయ్యా వేసి రూ.1.25 లక్షలు సమీకరించి మూడు చక్రాల సైకిల్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇదే రీతిలో కష్టాల్లో ఉన్న బాల్య మిత్రులను గుర్తించి చేయూతనివ్వాలని నిర్ణయించారు. వేసవి సెలవుల్లో కుటుంబ సమేతంగా ఆత్మీయ సమావేశం నిర్వహించి చారిటీ కార్యక్రమాలు నిర్వహించేలా భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ ఎలక్టెడ్ డిస్ట్రిక్ గవర్నర్ దత్త సుబ్బారావు

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య పరిరక్షణకు రోటరీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు రోటరీ ఎలక్టెడ్ డిస్ట్రిక్ గవర్నర్ దత్త సుబ్బారావు (విజయవాడ) అన్నారు. రోటరీ డిస్ట్రిక్ పరిధిలో 2023–24 సంవత్సరానికి కొత్తగా ఎంపికైన సభ్యులతో స్వాగతం పేరిట కాకినాడ రోటరీ హాల్ ఆదివారం సమావేశం నిర్వహించారు. మానసిక స్థితిగతులతో పాటు మాదక ద్రవ్యాల విషయంలోను యువతీ, యువకులను చైతన్య పరిచేందుకు అవగాహన కార్యక్రమాలు, వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి అంశానికి కమిటీలు ఏర్పాటు చేసి వాటిలో సేవా తత్పరతతో సమాజం పట్ల అవగాహన ఉన్న వ్యక్తులకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. తొలుత రోటరీ ప్రాంగణంలో ఉన్న రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారిస్ విగ్రహానికి నివాళులర్పించారు. రోటరీ మాజీ గవర్నర్లు కేవీఎస్ ఆంజనేయమూర్తి, ఎల్.సత్యనారాయణన్, డాక్టర్ పూషా, ఎస్‌వీఎస్‌రావు, వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ టెన్నిస్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



ఎస్‌జీఎఫ్ఐ టెన్నిస్ పోటీలో రాణించిన క్రీడాకారులతో సంఘం కార్యదర్శి కుమార్

నాగమల్లితోట జంక్షన్: నరసారావు పేటలో జరిగిన పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17, 19 టెన్నిస్ పోటీల్లో కాకినాడ టెన్నిస్ అకాడమీ క్రీడాకారులు పలు విభాగాల్లో ప్రతిభ కనపరిచారని టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. స్థానిక ఆర్ఎంసీ ప్రాంగణంలోని టెన్నిస్ కోర్టుల్లో శిక్షణ పొందుతున్న ప్రవల్లిక, హర్షిణి, నీరజ్, సాయి, మూర్తి, సాహిత్, అభినవ్, లోకేష్, లోచన, వేద, ఆశ్రిత పాల్గొన్నారు. అండర్–19 విభాగంలో శంకర్, అండర్–14 బాలికల విభాగంలో జి.మేధ రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలిచారని కుమార్ తెలిపారు.

మాతృభాష పరిరక్షణ మేధావుల బాధ్యత



కవులను సత్కరిస్తున్న వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్, ఉద్దగ సుబ్బారావు తదితరులు

కాకినాడ కల్చరల్: మాతృభాష పరిరక్షణ బాధ్యత మేధావులపై ఉందని సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాల ప్రోత్సాహ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దాడి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పైడా గిల్డ్ ఆఫ్ సర్వీస్ పాఠశాల సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేదిక ఆధ్వర్యంలో 20 మంది కవులను సత్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి సకల పద్మ అధ్యక్షత వహించారు. ప్రాథమిక విద్యాస్థాయి వరకు మాతృభాషలో బోధన చేయాలని ఎర్రబిల్లి శారద అన్నారు. మాతృభాష విశిష్టతను వక్తలు వివరించారు. ఉద్దగ సుబ్బారావు, సాహితీవేత్తలు పోచినపెద్ది సుబ్రహ్మణ్య నరసింహమూర్తి, మద్దాలి సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరంలో 2100 మందికి పరీక్షలు

- కోరమాండల్ ఆస్పత్రి వద్ద శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ చంద్రశేఖర్
- శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహణ



మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, శ్రీరంగ కుమార్

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకలలోని కోరమాండల్, శ్రీ కిరణ్ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కోరమాండల్ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన శ్రీ కిరణ్ ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టరు సంకురాత్రి చంద్రశేఖర్, కోరమాండల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరంగ కుమార్ ప్రారంభించారు. శిబిరంలో కాకినాడ రూరల్, పట్టణం, వివిధ ప్రాంతాల వచ్చిన 2100 మందికి వైద్య సేవలను అందించారు. వీరిలో 1200 మందికి కళ్లజోళ్లు, మందులు ఉచితంగా అందించారు. 300 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి శ్రీకిరణ్ ఆస్పత్రికి తరలించారు. కోరమాండల్ సహకారంతో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ శిబిరం నిర్వహించినట్టు కోరమాండల్ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అంధత్వ నివారణకు శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి కోరమాండల్ సంస్థ 12 ఏళ్లుగా పని చేయడం అభినందనీయమన్నారు. కోరమాండల్ వైద్యాధికారి రవిశంకర్, సీఎస్సార్ హెడ్ వంశీకృష్ణ, సురేష్‌బాబు, సంకురాత్రి ఫౌండేషన్ పీఆర్వో రాంప్రకాష్, ప్రొగ్రాం మేనేజరు సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లింగోద్భవ పూజలు



రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో నిర్వహిస్తున్న లింగోద్భవ కాల అభిషేకాలు

కాకినాడ రూరల్: మహా శివరాత్రి సందర్భంగా పగలంతా ఉపవాసాలతో శివ నామస్మరణ చేసిన భక్తులు శనివారం రాత్రి లింగోద్భవ కాలం, తెలవారుజాము వరకు అభిషేకాలు చేశారు. రమణయ్యపేట సౌజన్య నగర్‌లో ఏర్పాటు చేసిన శివ లింగానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దంపతులు, కుటుంబ సభ్యులు అభిషేకాలు చేశారు. ఆర్టీసీ కాలనీలో దీపాలు వెలిగించి లింగోద్భవ కాల అభిషేకాలు చేశారు. శ్రీపీఠంలో కుంకుమ పూజలు అనంతరం ఐశ్వర్యాంబిక గుడిలో సుందరేశ్వరుడిని భక్తులు దర్శించుకున్నారు. నేమాం శివాలయంలో తెల్లవారు జాము వరకు అభిషేకాలు జరిగాయి. తిమ్మాపురం, సర్పవరం, గోకుల్ గార్డెన్ తదితర చోట్ల రాత్రంతా భక్తులు జాగారంలో పాల్గొన్నారు.

శివలింగాన్ని దర్శించిన న్యాయమూర్తి

కాకినాడ రూరల్: శివరాత్రి సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వర్ణ లింగాన్ని ఆదివారం స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు దర్శించుకున్నారు. శివలింగ విశిష్టతను బ్రహ్మకుమారీలు ఆయనకు వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ భారీ శివలింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.



శివలింగ దర్శనం అనంతరం మెజిస్ట్రేట్‌కు జ్ఞాపికను అందజేస్తున్న బ్రహ్మకుమారి

దంత వైద్యులకు పురస్కారాలు



జాతీయ స్థాయి పురస్కారాలు అందుకుంటున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, తన్మయ

బోట్‌క్లబ్/కాకినాడ రూరల్: ముంబయిలోని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగిన జాతీయ పురస్కార వేడుకలో కాకినాడకు చెందిన వైద్యులు ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ జాతీయ స్థాయిలో ఉత్తమ అధ్యక్షుని పురస్కారంతో పాటు, గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించిన సేవలకు రెండు జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్నారు. అనునిత్యం తోడుగా నిలిచిన కుటుంబ సభ్యులకు, రాష్ట్ర ఇండియన్ డెంటల్ అసోసియేషన్, కాకినాడ అసోసియేషన్ సభ్యులకు, కాకినాడ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. భవిష్యత్‌లోను ఈ సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగిస్తానన్నారు. అలాగే కాకినాడ రూరల్ నియోజకవర్గం ఇంద్రపాలేనికి చెందిన దంత వైద్యురాలు పలివెల తన్మయి రామచంద్రకు ఉత్తమ అవార్డు వరించింది. 30 ఏళ్ల లోపు బెస్ట్ డెంటిస్ట్ విభాగంలో తన్మయికి డాక్టర్ రతన్ హెచ్ అవార్డును అందించారని ఆదివారం ఆమె మీడియాకు తెలిపారు. అలాగే బెస్ట్ స్కూల్ హెల్త్ యాక్టివిటీస్‌కు మరో అవార్డును పొందినట్టు ఆమె తెలిపారు. అవార్డులను నేషనల్ డెంటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టరు రవీంద్రసింగ్ కార్యదర్శి డాక్టరు అశోక్ దోబ్లే నుంచి అందుకున్నట్టు చెప్పారు. అవార్డులను అందుకున్న కుమార్తె తన్మయిని తల్లిదండ్రులు పలివెల లక్ష్మి, రాజు అభినందించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



వైద్య శిబిరంలో పాల్గొన్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తదితరులు

కాకినాడ: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి పేర్కొన్నారు. స్థానిక 43వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ జేడీ పవన్‌కుమార్ ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని మాజీ మేయర్ సుంకర శివప్రసన్నతో పాటు చంద్రకళాదీప్తి ప్రారంభించారు. శివప్రసన్న మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పవన్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు సుగర్, బీపీ, కంటి వైద్యం, మోకాళ్ల నొప్పులు, దగ్గు, థైరాయిడ్ వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామన్నారు. డాక్టర్ అంబటి ప్రదీప్తి వైద్యసేవలు అందించారు. మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత గణేష్‌యూత్ సభ్యులతో పాటు స్థానిక నాయకులు నమ్మి సత్యవాణి, గుత్తుల వీరవేణి, కమ్మం గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన మాఘ మాసోత్సవాలు

- 2.5 లక్షల మంది దర్శనాలు
- 1.1 లక్షల మందికి అన్నదానం
- ఇకపై ప్రతి ఆదివారం అన్నదానం
- నిత్యాన్నదానానికి నిధి సమీకరణ
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



భావనారాయణ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: సర్పవరం క్షేత్రంలోని శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ప్రతి ఆదివారం నిత్యాన్నదానం చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నెల రోజులు పాటు ఎంతో ఘనంగా జరిగిన మాఘ మాస ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. తొలుత స్వామివారిని ఎమ్మెల్యే దర్శించి అనంతరం మీడియాతో మాట్లాడారు. మాఘ మాసం సందర్భంగా సుమారు 2.5 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్టు తెలిపారు. గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ కమిటీ, పుల్ల చందు తదితరులు సుమారు 1.1 లక్షల మందికి అన్నదానం చేశారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్న నేపథ్యంలో హిందీ భాషలో కూడా సమాచార బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించినట్టు తెలిపారు. తరలివస్తుండడంతో హిందీలో సమాచార వివరాలు ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం నిత్యాన్నదానం ప్రారంభించనున్నామని, ఇందుకోసం రూ.50 లక్షల శాశ్వత నిధిని సమీకరిస్తున్నట్టు తెలిపారు. అంత వరకు ప్రతి ఆదివారం అన్నదానం చేస్తున్నట్టు తెలిపారు. త్వరలో జరగనున్న స్వామి కల్యాణోత్సవానికి ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని కోరామన్నారు. అలాగే రథోత్సవానికి కొత్త రథం తయారు చేయించనున్నామని, పండితుల సూచనల మేరకు పుల్ల చందు నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టబోతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ గోపుశెట్టి పద్మజా బాబ్జీ, సినీ దర్శకుడు కల్యాణ్ కృష్ణ, పుల్ల చంద్రరావు ట్రస్ట్ చైర్మన్ పుల్ల చందు, ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, సర్పంచ్ శీలం చిన్నా, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, రాష్ట్ర హిస్టరీ కార్పొరేషన్ డైరెక్టరు పుల్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాగా స్వామివారి ఆలయంలో ప్రతి ఆదివారం నిర్వహించనున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి వంట పాత్రలను ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు సమర్పించారు.

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు



యండమూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కరప: మండలం యండమూరులో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం శ్రవణం కలసిరావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వర వ్రతాలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కరప విష్ణ్వాలయంలోని వెంకటేశ్వర స్వామికి అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణలు పూజాదికాలు చేశారు. అలాగే పెనుగుదురు, వేళంగి, కూరాడ, గురజనాపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

చంద్రశేఖరస్వామి రథోత్సవం

సామర్లకోట: స్థానిక పాత సామర్లకోటలోని బాలత్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 16వ తేదీన స్వామి వారి కల్యాణం జరగడంతో మహాశివరాత్రి మరుసటి రోజున రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ పండితులు డి.పాపయ్యశాస్త్రి, చీమలకొండ వెంకటరమణల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రథోత్సవాన్ని రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పంచారామ క్షేత్ర ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మి ప్రారంభించారు.